# "తెలుగు కథానికల్లో మాండలికం"

- బానోత్ వెంకటేశ్వర్లు

**Received: Aug. 2019 Accepted: Sep. 2019 Published: Oct. 2019**

మౌఖిక సాంప్రదాయం నుండి పుట్టిన వేదాలను భద్రపరచుకున్న చరిత్ర ఉన్నది మనకు. కాని అదే మౌఖిక సాంప్రదాయం నుంచి పుట్టిన జానపద సాహిత్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాం. తెలుగు చందస్సును తీసకుని జానుతెనుగు భాషలో రచన చేసిన మొట్టమొదటి కవి పాల్కురికి సోమన. జన వ్యవహారంలో ఉన్న ప్రజల బాషలో ప్రజల గూర్చి రాసిన మొదటి ప్రజాకవి వేమన. ఉత్తమ పాత్రలకు సంస్కృతం, నీచ పాత్రలకు ప్రాకృతం పేరున పాత్రోచిత భాష పేరుతో ప్రజల భాషను కించపరచడం మనకు సంస్కృత నాటకాల్లో కనబడుతుంది. వ్యవహారిక భాషను పండితులు నిందించడం, దీనిని కావ్య భాషగా స్వీకరించడానికి ఉద్యమమే అవసరం కావడం మన సాహిత్య చరిత్రలోని ఓ వైరుధ్యంగా పేర్కొనవచ్చు.

వ్యవహారికభాష వాడడంకోసం, దానికి సాహిత్య గౌరవం తేవడం కోసం గిడుగు రామూర్తి న్యాయకత్వంలో వ్యవహారిక భాషోద్యమం వచ్చింది. ప్రజల భాషలో కన్యాశుల్కం నాటకం రాసి జీవద్భాష యొక్క సౌందర్యాన్ని పాటకులకు రుచిమాపించాడు గురజాడ. కన్యాశుల్కం నాటకాన్ని మాండలికంలో రాసి ఉండకపోతే దానికంత ప్రాముఖ్యత వచ్చిఉండేదికాదు. మాండలికాన్ని గ్రామ్యమని నిందించడం సరైనదికాదు. ఇది ప్రజలభాష జీవం జవసత్వాలున్న జీవద్భాష... వచన రచన కథ అంటేనే ప్రజాస్వామిక ప్రక్రియ. మేధావి నుండి సామాన్య మానవుని వరకు అందరిని రంజింపచేసేది కథ.

అందుకోసం కథ అందరికి అర్థమయ్యే జనసామాన్య భాషలో ఉండాలి. తెలుగులో మొదటి కథకుడైన గురజాడ కథలు శిష్టవ్యవహారికములో వచ్చాయి. వ్యావహారికం కంటే అభివృద్ధికరమైన, ప్రగతిశీలమైన, ప్రజాస్వామికమైన భాష ప్రయోగం మాండలికం. ప్రజల భాష గల గల పారే సెలయేరులాంటిదైతే గ్రాంధికం కదలిక లేని నిలువున్న నీరులాంటిది. అందుకే ప్రజల భాషయైన మాండలికాన్ని స్వంతం చేసుకొని కథా రచయితలు ఆ భాష సొగసులను, సౌందర్యాన్ని, బలాన్ని చాటి చెప్పారు.

మన రాష్ట్రంలో మాండలిక భాషను బట్టి నాలుగు ప్రాంతాలున్నాయి. పూర్వ మండలంలో కలింగప్రాంతం, శ్రీకాకులం, విజయనగరం జిల్లాలు వస్తాయి. దక్షిణ మండలంలో రాయలసీమ జిల్లాలు, నెల్లురు, ప్రకాశం జిల్లాలు వస్తాయి. ఉత్తర మండలంలో

తెలంగాణ జిల్లాలు వస్తాయి. మధ్యమండలంలో ఉభయగోధావరి జిల్లాలు కృష్ణా, గుంటూరు జిల్లాలు వస్తాయి. ఈ నాలుగు ప్రాంతాల ప్రజలు మాట్లాడే భాష ఒకటే అయినా ప్రజల వ్యవహారంలో పదాలలోనూ, వాటి ఉచ్ఛరణలోనూ, ప్రత్యాయాలలోనూ, పదాల అర్థాలలోనూ బేధాలుండి ఆ భాషలో రకాలు ఉంటాయి. ఒకే భాషకున్నట్టి ఆ భాషబేధాలను మాండలికాలంటారు. మాండలికాల సమాహారమే భాషఅని మాండలికం కాని భాషంటు లేదని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం.

రాచకొండ విశ్వనాథశాస్త్రి విశాఖపట్నం జిల్లా భాషలో రాసినట్లుగా, కా.రా. శ్రీకాకుళం భాషలో రాసినట్లుగా, విరసం రచయితలు తెలంగాణ భాషలో రాస్తున్నట్లుగా సాహిత్యం విరివిగా వచ్చి అఖండ సాహిత్యాన్ని పరిపుష్టం చేయాలి అంటాడు కొడవటిగంటి కుటుంబరావు. తెలుగులో మొట్ట మొదటిసారిగా కోస్తా మాండలికంలో అందులో అలగాజనమని పిలువబడే భాషలో పూర్తికథను మాండలిక భాషలో రాసి మెప్పించిన కథకుడు మా గోఖలే. పూర్తి మాండలికంలో రాసిన మొదటి కథ "అరికేం మారాజులు". ఇది 1944లో తెలుగుతల్లి పత్రికలో వచ్చింది.

సత్యంశంకరమంచి "అమరావతి కథలో" అన్ని రకాల ప్రజల మాటలు, సుఖదుఖాఃలు వాళ్ళ భాషలో వెల్లడించారు రచయిత. సంస్కారం ఉన్నవారు, కూలినాలి జనాలు, జమీందార్లు మాట్లాడే విధంలోని తేడాలు తమ కథలో చూపారు. "సుడిగుండంలో" ముక్కపుటక కథలోని మాటలను గమనించండి. "దొంగనాయాల్లారా... ఏడుపులా పెండెయ్. ఆ ముక్కు పుడక మా ఇంటోల్లకి పుట్టింటోరు పెట్టింది. కాష్ట తగ్గముఖం పెట్టినపుడు ఆ గుండంలో పడింది" గల గల పారే సెలయేరు లాంటి పల్లెయుల భాషలోని సొగసులను, ప్రయోగాలను తన కథలో ఉపయోగించారు సత్యం శంకరమంచి.

రాచకొండ విశ్వనాథశాస్త్రి తన రచన భాషకు మాండలికం లయగా స్వీకరించి అట్టడుగు జనాల పక్షం వహించి విశాఖ మాండలికంలో అద్భుత కళాఖండాలనదగిన కథలు వ్రాసాడు. వీరి సంభాషనల్లో గడుసుదనం ఉంది... కవిత్వం ఉంది... ఈ సామాజిక వ్యవస్థపై నిశితమైన విమర్షఉంది... రా.వి. శాస్త్రి, కా.రా. గారి రచనలల్లో వచ్చేడు, పోయేడు, బతికేడు, చచ్చేడు, పోతోంది, వస్తోంది లాంటి ప్రయోగాలు కనబడతాయి. శాస్త్రి రచనల్లో విశాఖ, శ్రీకాకుళం ప్రాంతంలో మాట్లాడే కూలీల బాషైన ఏటిబాబు, ఏటంటావు, నాకేటి లాంటి ప్రయోగాలు కన్పిస్తాయి. రా.వి. శాస్త్రి కథలోని సంభాషనల్లో కొంత కాల్పనికత ఉంటుందని విమర్షకుల అభిప్రాయము.

చోసో కథల్లోని పాత్రోచిత విజయనగర మాండలిక భాష చదివితే అట్టడుగు జనం భాషను రక్షిస్తున్నారన్న విషయం అర్థంఅవుతుంది. మన సంస్కృతిని రక్షించేది జానపదులే అన్న సంగతి తెలిసిపోతుంది. సజీవమైన ప్రజల భాష, జానపద కళలు ఇంతకాలంగా జీవించి ఉండటానికి కారణం జానపదులే. పోనియండి... నా నోరు ఏనాడో నొక్కుకు పోయింది. సరస్వతీ కటాక్షం నాకంతేఉంది. తల్లీ వెళ్ళిపోయింది. వెళ్ళి పోతు నాకో రవికగుడ్డపెట్టింది.

రాయలసీమ ప్రజల మాండలిక భాషకు సాహిత్యంలో స్థానం కల్పించిన మొదటి కథకుడు "కరుణకుమార" గ్రామీణుల ఆత్మీయమైన భాషలో వాస్తవికత దృక్పథంతో కథలు రాసి ఆ భాష సౌందర్యాన్ని చాటిచెప్పిన ప్రతిభావంతుడు కరుణకుమార. ఆ వస్తువులు పిల్లకాయల దగ్గర ఉండడానికి మాత్రం వీలులేదు. పోయి నువ్వు వాపసు తీసుకొని వస్తావా? లేదా...? రాయలసీమ పెద్దమనుషుల ఆధిక్య భావాన్ని తెలిపే ఈ మాటలు కరుణకుమార రాసిన "టార్చిలైటు" కథలోనిది. పిల్లకాయలు అనే పదం రాయలసీమ ప్రాంతానికి మాత్రమే పరిమితమైన పదం. రాయాలసీమ గ్రామాలల్లోని భూస్వాములు కూలీనాలి జనంపై చూపే దౌర్జన్యం దళితుల అసహాయస్థితి "కొత్త చెప్పులు" కథ ద్వారా తెలుసుకోవచ్చు. భర్తను పెనిమిటి అనడం అటు రాయలసీమలోను, ఇటు తెలంగాణలోనూ వాడుకలో ఉంది.

రాయలసీమ ప్రజల భాషను సొంతం చేసుకొని రాయలసీమకే సొంతమైన నుడికారంతో, వాస్తవిక దృక్పథంతో కథలు రాసిన ప్రతిభాశాలి కేతు విశ్వనాథరెడ్డి ఈయన కథల్లో రాయలసీమ మట్టివాసన ఉంటుంది. ముఖ్యంగా రాయలసీమ రైతుకుటుంబాల్లోని పదాలు, పలుకుబడులు బాగా ఉపయోగించాడీ రచయిత. "ఇంతకాలం భూమిని సాగుచేస్తుంటే యెందుకూకున్నారు? భూమి పక్కానికొచ్చిందని గోసులు విప్పుకొని వచ్చారు. దొంగ పట్టాలు వేసుకొని వేమియ్యం... యెందుకియ్యాల.. యేదైతే అదవుతుంది". సానుభూతి కథలోని ఓ పాత్ర మాటలివి. రైతుల బాకీల సుడుగుండాల గూర్చి, తెలిపే ఎన్నో పాత్రలు విశ్వనాథరెడ్డి రాసారు.

తెలంగాణలో కథ కోస్తా ప్రాంతం కంటే ముందే 1902లో వచ్చింది. భండారు అచ్చమాంబ రాసిన కథే మొదటికథ. ఆ తర్వాత మాడపాటి హనుమంతరావు 1912లో "హృదయశల్యం" అనే కథరాసాడు. సురవరం ప్రతాపరెడ్డి, గూడూరి సీతారాం, కాళోజి,

వట్టికోట, పొట్లపల్లి, సురవౌళి, బి.యస్. రాములు లాంటి వాళ్ళు తెలుగుకథను సుసంపన్నం చేశారు. తెలంగాణ కథలో మాండలికం వాడారు.

సురవౌళి రాసిన అంగుడుపొద్దు, రక్తపూజ, ఇప్పసారా... కర్నూలు టు హైదారాబాద్, ఒట్టు కథల్లో పాత్రోచిత మాండలిక భాష ఉంది.

గూడూరి సీతారం రంగడు కథలోని మాటలివి. దొరకున్న దొరసాని ఎన్నో పాళ్ళు నయం. దొరకేం తెలుత్తది? ఓ సారి దొరసాని సుట్టరికం పోతే దొర సంగతి బయటపడ్డది. ఏదో సూపుకుంటడు. అంతదొరసాని మీదికెల్లి నడుస్తది. యశోదరెడ్డి గారి "మా ఊరి ముచ్చట్లు" తెలంగాణ గ్రామాల్లోని ప్రజల భాషకు నిలువుటద్దాలు.

తెలంగాణ మాండలికంలో రచనలు చేయడం ఉద్యమస్థాయిలో స్వీకరించి రచయిత కథనంతో పాటు మొత్తం కథను మాండలికంలో రాసాడు అల్లం రాజయ్య. అతని మొదటి కథ "ఎదురు తిరిగితే"లోని మాటలివి. ఆలిండ్లు కాలగూల... కాముని పెంటగాను.. నాపోరగాండ్ల నోటికాడి బుక్క దీసుకున్నోని నోటికాడిబుక్క దేవుడు తీసుకుంటాడు. తెలంగాణ ప్రజల్లో వాడుకలో ఉన్న మారుమూల పదాలు, వ్యవసాయక కుటుంబంలోని పదాలేన్నో ఇందులో ఉపయోగించడం జరిగినది.

బీడి కార్మికుల జీవితాలపై మొట్టమొదటి నవలరాసిన బతుకుపోరు నవలా రచయితగా ప్రసిద్ధుడై గిరిజన జీవితాలపై రాసిన ప్రసిద్ధ కథ 'అడవిలో వెన్నెల'కు కొ.కు. అవార్డు పొందిన ప్రముఖ రచయిత బి.ఎస్. రాములు కథల్లో పాత్రోచిత తెలంగాణ మాండలికం ఉంది. ఆదిలాబాద్ మన్యం ప్రాంత గిరిజనుల గురించి అధ్యయనం చేసి వాళ్లలో ఒకడుగా జీవించి అడవిలో వెన్నల-1, అడవిలో వెన్నెల-2 కథలు రాసాడు.

మూడు ప్రాంతాల కథా రచయితలు వాడిన ప్రజల భాషను చదువుతుంటే మాండలిక భాషలోని తియ్యదనం ఆ భాషకున్న బలం అది ప్రజా హృదయాల్లోంచి ఆత్మీయంగా బయటకు రావడం అర్థమవుతుంది. అసలు ప్రాంతీయం కానిదంటూ భాషేలేదు. అన్ని భాషలు ఆయా ప్రాంతాల్లో మాట్లాడేవే. ఇప్పుడు ప్రామాణిక భాషలని చెప్పబడే భాష కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాలలో శిష్టులు మాట్లాడే వ్యవహారిక భాష అంటే ఆ ప్రాంతపు మాండలిక భాష అట్లాగే అన్ని భాషలు మాండలిక భాషలే...

ఎంత పండితుడైనా మాండలిక పదాలు వినియోగించుకోకుండా తన రచనలు చేయలేదు.

తెలంగాణలో వచ్చిండు, పోయిండు అంటే కోస్తాలో వచ్చాడు, పోయాడు అని, రాయలసీమలో వచ్చినాడు, పోయినాడు అని, తూర్పు మండలంలో వచ్చేడు, పోయేడు అని అంటారు. వస్తోంది, పోతోంది అనే క్రియలు కళింగ ప్రాంత రచయితల వాడుకలో కనబడతాయి. తెలంగాణ ప్రాంతం నుండి బి.యస్. రాములు, కాలువ మల్లయ్య, ఆడెపు లక్ష్మీపతి, బోయజంగయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, అల్లం రాజయ్య, పెద్దింటి అశోక్ కుమార్ ఇంకా చాలామంది రచయితలు విస్తృతంగా కథలు రాస్తున్నారు. రాయలసీమ నుంచి కె. సభా, మధురాంతకం రాజారాం, కేతు విశ్వనాథరెడ్డి, స్వామి, దేవపుత్ర, శాంతినారాయణ మరికొందరు రచయితలు రాయలసీమ జనజీవితాన్ని అక్షరీకరిస్తున్నారు. కోస్తానుండి అప్పలనాయుడు, గౌరునాయుడు, పాపినేని శివశంకర్, పెద్దిబొట్ల, కె. వరలక్ష్మీ, పి. సత్యవతి, వల్లూరి శివప్రసాద్, సుంకోజు దేవేంద్రచారి మంచి రచనలు చేస్తున్నారు.

ఇది వరకు ప్రకటించిన రచయితల కథా సంపుటాలతో పాటు అనేకమంది కథాసంపుటాలు ప్రచురించారు.

## ఉపయుక్త గ్రంథాలు:


1. కథాశిల్పం (విమర్శగ్రంథం) - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
2. కథానిక - స్వరూప స్వభావాలు (విమర్శగ్రంథం) - పోరంకి దక్షిణామూర్తి
3. పాలగుమ్మి పద్మరాజు కథానికలు - ఒక పరిశీలన - ఎం. సామ్రాజ్య లక్ష్మీ


***